కథ

# విజేత

- పి. ఉమా సరస్వతి

> ఈ వయస్సులో మీకు అండగా వుండటం మా ధర్మం కదా! మీరు పెట్టిన భిక్షే మమ్మల్ని ఈరోజు ఈ స్థానంలో నిలబెట్టింది. కేవలం ధనార్జనే జీవిత లక్ష్యం కాదు కదా! డబ్బైనా అప్పు పుడుతుందేమో గాని నాన్నగారు మనుషుల మధ్య ఉండే బంధాలు అనుబంధాలు, అనురాగాలు- వీటిని డబ్బుతో కొనలేము కదా! వీటి మూల్యం అమూల్యం అనే విషయం చాలా స్పష్టంగా అర్థమైంది.

**మెడలో** పూలదండల బరువు ఒక పక్కా, బుర్రలో ఆలోచనల భారం మరోపక్కా సతమతం చేస్తున్నాయి పరంధామయ్యగారిని పాపం. పూలదండలు తీసి పక్కన పెట్టి మెళ్లోభారాన్నైతే తగ్గించుకోగలిగారు గాని ఈ ఆలోచనల భారం తగ్గేదెలా? ఎడతెరపిలేకుండా వచ్చే ఆలోచనల్ని ఆపగలిగే స్థితిలో లేరు ఆయన. ఒక వైపు ఎంతో ఆనందించి గర్వపడాల్సిన ఆలోచనలైతే, మనసును క్రుంగదీసే ఆలోచనలు మరోవైపు. రెండు రకాల ఆలోచనల మధ్య అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు పరంధామయ్యగారు.

ఇవ్వాళ ఆయన 36 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యోగ జీవితానికి స్వస్తి పలికిన రోజు. జరిగిన 36 సంవత్సరాల తన పదవీకాలం ఎలా జరిగిందీ, తాను తన పదవీ బాధ్యతలను ఎలా నిర్వర్తించిందీ, ఎంతమంది మన్ననలను, ప్రశంసలను పొందిందీ, ఎంత సిన్సియర్‌గా పనిచేసిందీ యివన్నీ తన సహోద్యోగులు, తన పైఅధికారులూ వీడ్కోలు సభలో ఏకరువు పెడుతూంటే ఆయన మనసు ఎంతో ఉప్పొంగిపోయింది. కానీ యింతలోనే మరో ఆలోచన. నిజానికి యిలాంటి సందర్భాలలో ఎవరైనా పొగడడమే పరిపాటి గాని తెగడ్తలనేవి వుండవు కదా! నిజంగా యీ ప్రశంసలను అందుకునే అర్హత వుందా తనకు? ఇన్‌స్పెక్షన్ మొదలయ్యింది పరంధామయ్యగారి మనసులో. పాత జ్ఞాపకాలన్నీ ఒకదాని తర్వాత మరొకటి ఆయన మనసులో సినిమా రీలులా కదలసాగాయి.

పరంధామయ్యగారు ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి. హెడ్ గుమస్తాగా చాలా కాలం పనిచేసిన తరువాత పదవీ విరమణ చేసేందుకు ఆరు నెలల ముందే సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ అందుకున్నారు. అదీ ప్రభుత్వం వారు ఆయన మెరిట్‌ని, నిజాయితీని గుర్తించి ఇచ్చిన అవుటాఫ్ టర్న్ ప్రమోషన్. ఆ ప్రమోషన్ ఆర్డర్ చేతికి రాగానే ఆయన కళ్లను ఆయనే నమ్మలేకపోయారు. ఆనంద పారవశ్యంతో ఆయన కళ్లు చెమర్చాయి. ప్రమోషన్ వచ్చినందుకుకాదు. ఆయన నిజాయితీని ప్రభుత్వం వారు గుర్తించినందుకు. గుమస్తాగా చేరిన దగ్గర్నించి కూడా తన విధులను తాను తు.చ. తప్పకుండా నిర్వర్తించేవారు. పై అధికారుల చేత ఈపని నువ్వు చెయ్యవలసి వుంది అని చెప్పించుకుని ఎరుగరు. అంతేకాదు. ఎవరు సెలవులో వెళ్ళినా వాళ్ళపనిని కూడా నిరభ్యంతరంగా ఎంతో వుత్సాహంగా చేసేవారు. 'విసుగు' అనేది ఆయన నిఘంటువులోనే లేదు. ఎప్పుడూ చిదానందంగానే వుండేవారు. "ఈ పనిచేస్తే నాకొచ్చే లాభం ఏమిటి?'' అని లాభనష్టాలు బేరీజు వేసుకొనేవాళ్లే ఈరోజుల్లో అందరూ. అలాంటి ఈ రోజుల్లో నిష్కామంగాను, ప్రతిఫలాపేక్ష లేకుండాను పనిచేసేవారి సంఖ్య వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అలాంటి కొద్ది మందిలో ఆయన ఒకరు. అందుకే ఆయన పేరు ఆఫీసు వారు రికమండ్ చేసారు. ఆ ప్రమోషన్‌కి ఆయన అర్హతను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమోషన్ వచ్చిన దగ్గిర నుంచి ఆయన బరువు బాధ్యతలు ఎక్కువైనాయి. అయినప్పటికీ ఆయన వదనంలో చిరునవ్వు ఎప్పుడూ చిందులాడుతూనే వుండేది. మొట్ట మొదటి

నుంచి వృత్తే దైవం అని నమ్మిన వ్యక్తి ఆయన. అందుచేత ఇప్పుడు ఆయన నిర్వర్తించవలసిన అదనపు బాధ్యతలను కూడా ఎంతో నేర్పుతోనూ, సౌలభ్యంతోనూ నిర్వర్తించసాగారు. కాలగమనంలో ఆరునెలల కాలం గిర్రున తిరిగిపోయింది. పదవీ విరమణ రోజురానే వచ్చింది. ఎంతకాలం పనిచేసినా ఏదో ఒకరోజు పదవీ విరమణ చేయడం తప్పనిసరి కదా!

ఆలోచనలో పడ్డారు పరంధామయ్యగారు. ఏదో మధ్యతరగతి జీవితం తనది. చాలీచాలని జీతాలు, ఎప్పటికప్పుడు ఏవో ఖర్చులు, పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళు, మగపిల్లల విదేశీ చదువులు ఒకదాని తరువాత మరొకటి! యివన్నీ దాటుకుంటూ వచ్చే సరికి రిటైర్‌మెంట్ రానే వచ్చింది. సర్వీసులో వుండగానే నాలుగు రాళ్లు వెనకేద్దామా అంటే కుదిరితేనా? ఇప్పుడు రేపటి నుంచి ఆ వచ్చే జీతం గూడా రాదు. ఇంక యింట్లో జరుగుబాటు ఎలాగు? నెల తిరిగేసరికి జీతం వస్తేనే అంతంత మాత్రంగా నడిచేవి రోజులు. ఫస్టు తారీఖు యింకా వారం రోజులుండనగానే ఫస్టు ఎప్పుడా అని ఎదురుచూడడం మొదలు! అలాంటిది జీతంలోసగం కూడా లేని పెన్షన్‌తో జీవితం గడపడంఎలా? ఇలా ఆలోచిస్తూ యిల్లు చేరారు - రేపటి నుంచి ఈ ప్రయాణానికి ఇక స్వస్తి అనుకుంటూ

భర్త రాకకోసం ఎంతో ఆతురతతో ఎదురు చూస్తున్న అయన భార్య సోమిదేవమ్మ "ఏమండీ? ఆలస్యమైందేం? ఇవాళ ఫేర్‌వెల్ ఎలా జరిగింది? " అంటూ ప్రశ్నించింది. "అంతా బాగానే జరిగింది" అంటూ లోపలికి వెళ్ళి కాళ్ళు కడుక్కొని వచ్చి పడక కుర్చీలో జారగిలబడ్డారు పరంధామయ్యగారు.

గబగబా వంటింట్లోంచి కాఫీ కప్పు తెచ్చి భర్తకి అందించి తానూ తీసుకుంటూ "యిప్పుడు చెప్పండి విశేషాలేమిటో" అంది

"ఏం చెప్పమంటావు? ఇవ్వాల్టి నుంచి యిక వుద్యోగానికి స్వస్తి. రేపటి నుంచి ఆఫీసుకి రావాల్సిన పని లేదంటూ రిటైర్‌మెంట్ ఆర్డర్ చేతికిచ్చారు ఆఫీసువారు. ఉద్యోగంలో చేరిన ప్రతివ్యక్తికి ఏదో ఒకరోజు ఈరోజు రావడం ఖాయం. అయితే ఈరోజు తర్వాత జీవితం

**"ఈ పనిచేస్తే నాకొచ్చే లాభం ఏమిటి?" అని లాభనష్టాలు బేరీజు వేసుకొనేవాళ్లే ఈరోజుల్లో అందరూ. అలాంటి ఈ రోజుల్లో నిష్కామంగాను, ప్రతిఫలాపేక్ష లేకుండాను పనిచేసేవారి సంఖ్య వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అలాంటి కొద్ది మందిలో ఆయన ఒకరు.**

● ● ● ● ● ● ● ● ● ● ● ●

ఎలా జీవించాలి? "సేవ్ ఫర్ ది రెయినీ డే" అనే సూక్తిని దృష్టిలో వుంచుకొని ముందు జాగ్రత్తపడేవారు కొందరైతే "ఆదివారంనాడు అందలం, సోమవారంనాడు జోలి" అన్నట్టు ఉన్నప్పుడు జల్సాచేసి తరువాత దుఃఖపడేవారు మరికొందరు! అయితే ఇంతకీ నేను ఈ రెండింటిలో ఏ కోవకి చెందిన వాడిని? రెండో కోవకైతే అసలే కాదు. మొదటి కోవకి అందామా అంటే తను ముందు జీవితాన్ని ఏ మాత్రం ప్లాన్ చేయలేదు. నిజానికి చేయాలని ఎంత ప్రయత్నించలేదు!! అయినా తన శక్తి, యుక్తి, ఆర్జితం అంతా సక్రమమైన మార్గంలోనే వినియోగించారు. తాననుకున్న ప్రయోజనాలన్నీ సాధించారు. పిల్లల్ని పెద్ద వాళ్లని చేసి ప్రయోజకుల్ని చేశారు. ఆ తృప్తే ఆయనకి తీరని ధనం. ముందు జీవితం ఎలా అనే ఆలోచన మనసులోకి వస్తే కొంచెం కలవరంతప్ప అయినా నా పిచ్చిగాని అంతా సక్రమంగా జరిగితే మనవ్రనతే అనుకుంటాం లేకుంటే భగవంతుణ్ణి నిందిస్తాం. నిజానికి భగవంతుడి కరుణ ఒకే విధంగా ప్రసరిస్తుంది దాన్ని అందుకోవడం ఎంత? అంటే మన పాత్ర ఎంతో అంత. మన పాత్రను బోర్లించి మనకు అందలేదు అంటే ఎలా? భగవంతుడి మీద మనకు సంపూర్ణమైన విశ్వాసం వుంటే ఆత్మవిశ్వాసమే మనకు అండదండై నిలుస్తుంది. ఆ నారు పోసినవాడు నీరుపోయకుండా వుంటాడా? అయినా యింతవరకూ ఏ ఒడిదుడుకులూ లేకుండా యిలా జరగడానికి కారణం ఆయన చలవేకదా!"

ఇలా తన ధోరణిలో చెప్పుకుపోతున్న భర్త మాటలకు అంతరాయం కల్గిస్తూ అన్నారు సోమిదేవమ్మ గారు "ఏమండీ! అసలు విషయం చెప్పడం మరిచాను.

మన పిల్లలిద్దరి దగ్గర నుంచి వుత్తరాలు వచ్చాయి. ముఖ్యంగా శుభాకాంక్షలు తెలియజేశారండీ" అంటూ వుత్తరాలు అందించారు సోమిదేవమ్మగారు. చదవనారంభించారు పరంధామయ్యగారు.


"బ్ర.వే. నాన్నగారికి అనేక నమస్కారాలు. నాన్నగారూ! ఈ వుత్తరం అందే సమయానికి మీరు అరవై సంవత్సరాలు పూర్తి చేసుకొని వుంటారు. ఈ సందర్భంలో మా అందరి తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నాన్నగారూ! మీ కొక శుభవార్త మేమందరం ఇక ఇండియాకే వచ్చి సెటిల్ అయిపోవాలని నిర్ణయించుకున్నాం. తమ్ముడు కూడా నాల్గురోజుల క్రితమే యిక్కడికి వచ్చాడు. వాళ్లూ అలానే నిర్ణయించుకున్నారట. ఈ వయస్సులో మిమ్మల్నిద్దరిని ఒంటరిగా వదిలేసి మేము మాత్రం ఇక్కడ ఎలా వుండిపోగలం? ఏ మాత్రం ఆరోగ్యం సరిగా లేకపోయినా పిలిస్తే పలికే దిక్కులేకుండా మీరు అక్కడ అవస్థ పడుతూ వుంటే మీ అవస్థలు మీరు పడండి మా ఉద్యోగాలు మావి అని ఎలా అనుకోగలం? ఎందుకో దాదాపు నెల రోజుల నుంచి పనిచేస్తున్నా మీరే గుర్తొస్తున్నారు. వెంటనే రెక్కలు కట్టుకుని మీముందు వాలాలి. మిమ్మల్నిద్దరినీ వెంటనే చూడాలని మనసు పదే పదే కోరుకొంటోంది. మీరు అహోరాత్రాలు శ్రమించి మమ్మల్ని యింతవాళ్ళని చేశారు. ఈ వయస్సులో మీకు అండగా వుండటం మా ధర్మం కదా! మీరు పెట్టిన భిక్షే మమ్మల్ని ఈరోజు ఈ స్థానంలో నిలబెట్టింది. కేవలం ధనార్జనే జీవిత లక్ష్యం కాదు కదా! డబ్బైనా అప్పు పుడుతుందేమో గాని నాన్నగారూ! మనుషుల మధ్య ఉండే బంధాలు, అనుబంధాలు, అనురాగాలు- వీటిని డబ్బుతో కొనలేము కదా! వీటి మూల్యం అమూల్యం అనే విషయం చాలా స్పష్టంగా అర్థమైంది. యిక్కడి ఈ పదేళ్ల జీవితంలో ఇక్కడ వుండటం వల్ల నేను గాని మీ కోడలుగాని ఎంత కోల్పోయామూ అనేది మాటల్లో చెప్పలేను. అందుకే చాలా ఆలోచించిన మీదట ఈ నిర్ణయానికి వచ్చాను. తమ్ముడు కూడా అలాగే నిశ్చయించుకోవడం అనేది స్ట్రేంజ్ కో-ఇన్సిడెన్స్ అయినా ఒక తానులో గుడ్డలమే కదా మరి. అందుకే ఒకే రకమైన ఆలోచనలు. సాధ్యమైనంత తొందర్లో రెక్కలు కట్టుకొని మీ ముందు వాలుతాం. నమస్కారములతో...

మీ...

శ్రీచరణ్

ఉత్తరమంతా ఆమూలాగ్రం పదేపదే చదువుకున్నారు పరంధామయ్యగారు. ఆయన ఆనందానికి అవధులు లేవు. కళ్లనుండి ఏకధారగా కారుతున్నాయి కన్నీళ్లు. ఎంత ప్రయత్నించినా ఆగడంలేదు. "నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి" అన్న ఆ కవి మాటలు అక్షర సత్యాలు.

'తండ్రికి పుత్రోత్సాహం పుత్రుడు పుట్టినప్పుడు కల్గదు. ఆ పుత్రుడు పెరిగి పెద్దవాడై ప్రయోజకుడైన నాడే తండ్రికి పుత్రోత్సాహం కల్గుతుంది' అన్న సుమతీ శతకకారుణ్ణి హృదయంలో అభినందిస్తూ కారుతున్న కన్నీళ్లను రుమాలుతో వత్తుకుంటూ లోనికి నడిచారు పరంధామయ్యగారు. జీవితంలో తనకన్నా విజయం సాధించిన వారు ఎవ్వరూ వుండరేమోననుకున్నారాయన!



"సహృదయం సాంమనస్య
మవిద్వేషం కృణోమి వః"

హృదయాలు కలసి, మంచి మనస్సుతో
విద్వేషాలు లేకుండా మీరంతా ఉండాలి.

- అథర్వణ వేదం